ప్రజాశక్తి

శుక్రవారం 9 ఆగస్టు 2024

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

# తర్జనభర్జనలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా టిడిపి తన అభ్యర్థిని ప్రకటించుకోలేక తర్జనభర్జనలు పడుతోంది. కూటమి పార్టీలకు ఓట్లు తక్కువ ఉండడంతో గెలవడానికి సరిపడా ఓట్లను రాబట్టుకోవడం కోసం ఖర్చుకు వెనుకాడని సరైన వ్యక్తిని ఎంపిక చేయడానికి జరుగుతున్న కసరత్తులో ఈ జాప్యం నెలకొంది. గురువారం జరిగిన టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశంలో సైతం ఎమ్మెల్సీ అభ్యర్థిని నిర్ణయించలేకపోయారు. కొద్ది రోజుల క్రితమే వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఆ పార్టీ ప్రకటించింది. స్థానిక సంస్థల ఓటర్ల బలంతో పాటు ఎన్నికల నిర్వహణ నైపుణ్యం కలిగిన బొత్సను బరిలోకి వైసిపి దించడంతో ఆయనకు ధీటైన వ్యక్తిని బరిలోకి దించాలన్న ఆలోచనతో అభ్యర్థి ఎంపికలో పొరపాటు జరగకుండా టిడిపి గట్టి కసరత్తు చేస్తోంది. ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో పార్టీ సేవలు, అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఎలాగైనా గెలవగలిగిన వ్యక్తి కోసమే అన్వేషిస్తోంది.



బైరా దిలీప్ చక్రవర్తి



గండి బాబ్జీ



పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, మాడుగుల నియోజకవర్గ నాయకులు పివిజి కుమార్, బైరా దిలీప్ చక్రవరి పేర్లు పరిశీలనలో వున్నట్లు ప్రచారం జరుగుతోంది. పీలాను ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటిస్తారని బుధవారం వరకు నాయకత్వం

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిపై తేల్చుకోలేని టిడిపి
- పరిశీలనలో ఐదుగురు
- దిలీప్ చక్రవర్తిపై చంద్రబాబు మొగ్గు
- వ్యతిరేకిస్తున్న స్థానిక నాయకత్వం
- బొత్స వీగిపోకూడదన్న పట్టుదలతో వైసిపి

భావించింది. అభ్యర్థి ప్రకటనలో జాప్యం జరగడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. డబ్బులు ఖర్చు పెట్టగలిగిన దిలీప్ చక్రవర్తిని బరిలోకి దింపితే బాగుంటుందన్న ఆలోచనలో చంద్రబాబు వున్నట్లు తెలుస్తోంది. పీలాను బరిలోకి దించాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టిడిపి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ఏకాభిప్రాయానికి వచ్చి టిడిపి అధినేత చంద్రబాబు మిగతా 2లో..

వార్త 8లో..



అనకాపల్లిలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం తదితరులు

## బుద్ధదేవ్ మరణం తీరని లోటు

సంతాప సభల్లో సిపిఎం నాయకులు

## స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయరాదని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1230వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పెన్షనర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన కేవలం ఐదు వేల కోట్ల పెట్టుబడితో ఏర్పడి ప్రభుత్వ రంగంలో దాదాపు 50 ఏళ్లకుపైగా స్టీల్‌ప్లాంట్ లాభాల బాటలో నడిచిందన్నారు. అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రానికి వివిధ మిగతా 2లో..

### ఎపిఐఐసి గ్రీన్ బెల్ట్ స్థలం కబ్జా

వార్త 4లో..

### నూతన క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన

వార్త 4లో..

### ఎస్ఎంసి కమిటీ మెంబర్లు ఎన్నిక

వార్త 4లో..



క్షేమంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

## ఫిషింగ్ బోటుకు ప్రమాదం

- మత్స్యకారులు క్షేమం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వేటకు వెళ్లి తిరిగి వస్తున్న ఫిషింగ్ బోటు గురువారం సాయంత్రం ఆర్‌కె బీచ్ వద్ద ప్రమాదానికి గురైంది. బోటుకు అడుగున ఉన్న ఫ్యాన్ రెక్కలు ఆ ప్రాంతంలో సముద్రంలో ఉన్న రాళ్లకు చిక్కుకోవడంతో ప్రమాదం జరిగిందని మత్స్యకారులు తెలిపారు. ప్రమాదం నుంచి ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే బోటుకు మాత్రం రూ.20 లక్షలు మేర నష్టం కలిగిందని విశాఖపట్నం హార్బర్ బోటు యజమానుల సంఘం అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ మీడియాకు మిగతా 2లో..

# ఎక్కడివారు అక్కడే..!

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎవరు ఏ స్థానంలో పనిచేశారో.. అదే స్థానాన్ని తహశీల్దార్లకు తాత్కాలికంగా అనివార్యంగా కేటాయించాల్సి వచ్చింది. జిల్లాలో వివిధ స్థానాల్లో పనిచేసిన 24 మంది తహశీల్దార్లు ఎన్నికలకు ముందు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీపై వెళ్లారు. ఇటీవల వేర్వేరు జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన తహశీల్దార్లను రిలీవ్ చేయడంతో వారంతా బదిలీచేసిన చోటుకు వెళ్లిపోయారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన జిల్లాకు చెందిన పలువురు తహశీల్దార్లకు సకాలంలో పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఎమ్మెల్యేల నుంచి తొలనొప్పిలేకుండా వారు సిఫార్సు చేసినచోటకు తహశీల్దార్లను బదిలీచేయాలని అధికారులు భావించారు. అసెంబ్లీ సమావేశాలు జరగడం, తహశీల్దార్ల విషయంలో

- ఎన్నికల కోడ్‌తో తహశీల్దార్ల బదిలీకి బ్రేక్
- తాత్కాలికంగా యథాతథ స్థానాల్లో కొనసాగింపు
- కోడ్ ముగిశాక సిఫార్సుల ప్రకారం స్థాన చలనం

ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో బదిలీల్లో జాప్యం చోటుచేసుకుంది. తహశీల్దార్ల సామాజిక తరగతి, విధేయతను చూసి ఎమ్మెల్యేలు కలెక్టర్‌కు సిఫార్సు లేఖలు ఇచ్చారు. కొంతమంది తహశీల్దార్లను తమ నియోజకవర్గానికి కేటాయించాలని ఎమ్మెల్యేలు ఎవరికివారు పట్టుబట్టడంతో బదిలీ వ్యవహారం కొలిక్కిరాలేదు.

జిల్లాకు వచ్చిన తహశీల్దార్లు కొందరు తమకు నచ్చిన చోటకు బదిలీపై వెళ్లిపోతామని ధీమా వ్యక్తంచేశారు. బదిలీ చేయకముందే తనకు బదిలీ జరిగే చోటు తహశీల్దార్లు చెప్పుకొనేలా సిఫార్సుల వ్యవహారం బయటకు పొక్కింది. ఒకటి రెండు రోజుల్లో తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇవ్వడానికి ప్రాథమిక కసరత్తూ జరిగింది. ఎమ్మెల్యేలతో చివరిగా సంప్రదించి తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇద్దామనుకొనేలోపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బదిలీలు నిలిచిపోయాయి. రిలీవ్ అయిన వారి స్థానాల్లో తహశీల్దార్లకు నియమించకపోవడంతో ఆ స్థానాలు ఖాళీగా వున్నాయి. ఎన్నికల కోడ్ వుండగా బదిలీలు చేపట్టకూడదు. అందుకని బదిలీ చేయకుండా జిల్లాకు కేటాయించిన తహశీల్దార్లకు గతంలో పనిచేసిన స్థానాలు కేటాయించి ఇంతవరకు నెలకొన్న అనిశ్చితిని కలెక్టర్ విజయకృష్ణన్ మిగతా 2లో..



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న సిపి

## కంచరపాలెం స్టేషన్‌లో సిపి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గురువారం మధ్యాహ్నం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడుతూ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది వారి పట్ల ప్రవర్తిస్తున్న తీరును స్వయంగా ఆరాతీశారు. వారి సమస్యలను తెలుసుకొని, పోలీస్ స్టేషన్ నుంచి వాటిని పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ మొత్తం కలియదిరిగారు. స్టేషన్‌కు ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపరాదన్నారు. శుభ్రంగా ఉంచి మొక్కలు నాటాలని ఆదేశించారు.

## మొదటి పేజీ తరువాయి..

### తర్జనభర్జనలు

దృష్టికి తీసుకెళ్లినా దిలీప్ చక్రవర్తి పట్ల చంద్రబాబు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. చక్రవర్తికి అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ మద్దతు ఇస్తున్నట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల నుంచి దిలీప్ చక్రవర్తి విషయంలో అయ్యన్నపాత్రుడు అభ్యంతరం తెలుపుతూ వస్తున్నారు. అనకాపల్లి ఎంపీ టిక్కెట్ చక్రవర్తి ఆశించినా ఆయనకు దక్కకుండా చేయడంలో కృతకృతులయ్యారు. పీలా పట్ల అయ్యన్నపాత్రుడు సహా టిడిపి ఎమ్మెల్యేలు సానుకూలంగా వున్నారు. అభ్యర్థి ఎంపికలో చంద్రబాబుకు తేల్చుకోలేక ప్రకటించకుండా వాయిదావేస్తూ వస్తున్నారు. ఇదిలావుండగా.. ఓటర్ల రీత్యా కూటమి పార్టీల కంటే వైసిపి బలం ఎక్కువగా వుంది. వైసిపిని వీడ్డానికి సుముఖంగా వున్న ఎంపిటిసిల వివరాలను నియోజకవర్గాల వారీగా సేకరించి పనిలో కూటమి ఎమ్మెల్యేలు వున్నారు. తమకు బలంలేకున్నా ఎమ్మెల్సీ స్థానం వైసిపికి దక్కకూడదన్న పట్టుదలతో టిడిపి వుంది. ఏజెన్సీలో స్థానిక సంస్థల్లో తమ పట్టు పెంచుకొనేందుకు వైసిపి ఎంపిటిసిలను తమవైపునకు లాగేసుకోవాలని టిడిపి గట్టి ప్రయత్నాలు చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు, అరకు నియోజకవర్గాలతో పాటు అరకు పార్లమెంట్ స్థానాన్ని వైసిపి దక్కించుకుంది. ఆ బలాన్ని దెబ్బతీసేందుకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికను తమకు అనుకూలంగా మలచుకోవాలని టిడిపి నాయకత్వం గట్టి ప్రయత్నం చేస్తోంది. అయితే తమ బలం చెక్కుచెదరకుండా నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకత్వంతో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి సమావేశాలు నిర్వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సూచనలు చేస్తున్నారు. ఎమ్మెల్సీగా బొత్స గెలవడం ద్వారా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వైసిపి క్యాడర్‌లో నెలకొన్న నిరుత్సాహం పోగొట్టవచ్చన్న ఆలోచనలో జగన్మోహన్‌రెడ్డి వున్నట్లు తెలుస్తోంది. సంఖ్య రీత్యా గెలవగలిగిన బలం వైసిపికి వుండడంతో ఎమ్మెల్సీ పదవి చేజారిపోకుండా నియోజకవర్గాల వారీగా నాయకత్వాన్ని అప్రమత్తం చేస్తున్నారు.

### ఎక్కడివారు అక్కడే..!

తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత 24 మంది తహశీల్దార్లకు స్థాన చలనం కలగనుంది. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎమ్మెల్యేల సిఫార్సుల ప్రకారం వీరి బదిలీలు జరగనున్నాయి.

# రూ.9 వేల పెన్షన్ కోసం ధర్నా

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఇపిఎస్ 95 పెన్షన్‌దారులకు నెలకు రూ.9 వేలు పెన్షన్, డిఎను అమలు చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్ డిమాండ్ చేశారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అసోసియేషన్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇపిఎస్ పెన్షనర్ల పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. రెండు రోజులుగా ఢిల్లీలో తమ అసోసియేషన్ ఆధ్వర్యాన పెన్షనర్లు ధర్నా చేపడుతుంటే కేంద్ర ప్రభుత్వం అనేక అడ్డంకులు, నిర్బంధాలు ప్రయోగించడం సరైందికాదన్నారు. కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎందుకు తిరస్కరిస్తోందో టిడిపి, జనసేన, వైసిపి ఎంపిలు ప్రశ్నించకపోవడం శోచనీయమన్నారు.

2023 ఆర్థిక సంవత్సరంలో ఇపిఎస్ 95 పెన్షన్స్ కార్పెస్ ఫండ్ రూ.7.80 లక్షల కోట్లు అని, దీనిపై రూ.15 వేల కోట్లు వడ్డీ వస్తున్నా కేవలం రూ.4 వేల కోట్లను మాత్రమే పెన్షన్ రూపంలో చెల్లించడం అన్యాయమన్నారు. మిగిలిన నిధులను ఎపిఎఫ్ఒకు మళ్లించడం సరైందికాదన్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పెన్షన్ కంటే ఇపిఎస్ 95 పెన్షన్‌దారునికి తక్కువ వస్తోందని అన్నారు. హయ్యర్ పెన్షన్‌కు అర్హత ఉన్నా కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. భార్యాభర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని, రైల్వే రాయితీని పునరుద్ధరించాలని, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే సామాజిక పెన్షన్‌తో పాటు సంక్షేమ పథకాలు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెపి.కుమార్, కె.నూకరాజు, కెఎం.కుమార మంగళం, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న పెన్షనర్లు

### స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

పన్నుల రూపంలో రూ.50 వేల కోట్ల వరకు ఆదాయం స్టీల్‌ప్లాంట్ ద్వారా లభించిందని తెలిపారు. రిజర్వేషన్లు అమలు జరిగి ఎస్‌సి, ఎస్‌టిలకు, వికలాంగులకు ఉపాధి లభించిందన్నారు. అటువంటి సంస్థను ప్రైవేటీకరణ చేస్తే రిజర్వేషన్లు లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు లాభాపేక్షతో ప్లాంట్‌ను నిర్వహిస్తూ, అవసరమైతే నష్టాల పేరుతో శాశ్వతంగా మూసివేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయాన్ని గుర్తెరిగి కేంద్రం ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదన్నారు. దీక్షలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కెపి.కుమార్, సభ్యులు కె.నూకరాజు, కెఎం.కుమార మంగళం పాల్గొన్నారు.

### ఫిషింగ్ బోటుకు ప్రమాదం

తెలిపారు. బోటు ప్రమాదానికి గురైన సంగతి తెలియడంతో ఆ ప్రాంతానికి చెందిన మత్స్యకారులు వందలాది మంది సంఘటనా ప్రాంతానికి వచ్చి సముద్రంలో చిక్కుకున్న బోటును తిలకించారు. బోటును వెలుపలకు తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### ఘనంగా ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహిస్తున్న రెండో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్‌లో భాగంగా గురువారం ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో వాక్‌థాన్ నిర్వహించారు. ఏవియేషన్ సెక్యూరిటీపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమలలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ స్టాఫ్, సిఐఎస్ఎఫ్, ఎయిర్‌లైన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### మక్కా యాత్రకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** 39వ వార్డుకు చెందిన షేక్ మహమ్మద్ బేగం మక్కా యాత్ర ఖర్చులకు మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

## ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యాన వాక్‌థాన్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఇండియన్ బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని డిపాజిట్ల సమీకరణ కోసం ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం విశాఖపట్నం వారు స్థానిక ఆర్కే బీచ్ రోడ్డులో గురువారం ఉదయం వాక్‌థాన్ నిర్వహించారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ పుర్బే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ చరిత్రను, బ్యాంకు అందిస్తున్న సేవలు, ఇతర కార్యకలాపాలను తెలియజేశారు. ఖాతాదారుల అవసరాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఉత్తమ పెట్టుబడి మార్గాలను కల్పించడంలో తమ బ్యాంకు ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ప్రస్తుతం బ్యాంకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో అందిస్తున్న డిపాజిట్ పథకాలను తెలియజేశారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

### ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** 38వ వార్డు జనసేన నాయకుడు ధనాలకోట శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు జెర్సీలను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ధనాలకోట శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు నగదు ఇవ్వనున్నట్టు తెలిపారు. మ్యాచ్‌లను టెన్నిస్ బాల్‌తో, లాక్ అవుట్ పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్ బహుమతులు ఇవ్వనున్నామన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** గుర్తు తెలియని 20 ఏళ్ల యువకుడి మృతదేహం గురువారం కలెక్టరేట్‌కు డౌన్‌లో ఉన్న కోస్టల్ బ్యాటరీ తీర ప్రాంతం వద్దకు కొట్టుకొచ్చింది. ఆ యువకుడి ఆచూకీ కోసం మహారాణి పేట పోలీసులు గాలిస్తున్నారు. సముద్రంలో సరదాగా దిగి మృతి చెందాడా, మరేదైనా కారణమా ? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

### తూర్పు నౌకాదళ కమాండ్‌ను సందర్శించిన సిఎన్ఎస్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నావల్ స్టాఫ్ చీఫ్ (సిఎన్ఎస్) అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి నేవల్ వెల్ఫేర్ అండ్ వెల్నెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శశి త్రిపాఠితో కలిసి రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖలోని తూర్పు నౌకదళానికి వచ్చారు. ప్రధాన కార్యాలయం వద్ద సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. పర్యటనలో భాగంగా తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌తో సమావేశమై పలు ప్రాజెక్టులపై సమీక్ష జరిపారు.

# బాకురుపాలెం బోడిమెట్టకొండ ఆక్రమణ



నీలగిరి మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

## అక్రమంగా నీలగిరి, మామిడి తోటల ఏర్పాటుకు సిద్ధం

## అడ్డుకున్న రెవెన్యూ యంత్రాంగం

**ప్రజాశక్తి-ఆనందపురం :** మండలంలోని పందలపాక పంచాయతీ బాకురుపాలెం సర్వేనెంబర్ 3లో బోడిమెట్ట కొండను ఆక్రమించి నీలగిరి, మామిడి తోటలు వేసేందుకు సిద్ధమవుతున్న ఆక్రమణదారులను గురువారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. బాకురుపాలెం బోడిమెట్ట కొండను నాలుగు రోజుల నుంచి చదును చేసి కొంతమంది నీలగిరి, మామిడి మొక్కలను వేస్తున్నారు. దీనిపై గ్రామానికి చెందిన కొంతమంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ శ్యాంప్రసాద్, విఆర్ఒ శ్రీనివాసరావు, ఆర్ఐ మణికంఠ కొండ వద్దకు చేరుకొని అక్రమంగా వేస్తున్న నీలగిరి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, కొండ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు చేపడతామన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** నిర్వహణ పనుల నిమిత్తం మండలంలోని 11 కెవి పరిధిలో గల చిప్పాడ, జివిఎంసి 3, 4 వార్డుల పరిధి భీమిలి టౌన్, ఉప్పాడ ప్రాంతాల్లో ఈ నెల 9వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ జోన్ 3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జివిఎంసి 4వ వార్డు పరిధి సోమన్న పాలెం, రెడ్డిపాలెం, కాపుల దిబ్బడిపాలెం, రేఖవానిపాలెం పంచాయితీ రాయిపాలెం, దెక్యతి పాలెం, మహాలక్ష్మిపురం, మూలకుద్దు తదితర ప్రాంతాలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

## మందుబాబులకు జరిమానా

**ప్రజాశక్తి- ఆనందపురం :** మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురికి జరిమానా విధిస్తూ భీమిలి మెట్రోపాలిటన్ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. ఇటీవల ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి పట్టుబడిన ఏడుగురిపై కేసు నమోదు చేసి భీమిలి కోర్టుకు తరలించగా, భీమిలి అదనపు మెజిస్ట్రేట్ డి.సౌజన్య ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పాపారావు హెచ్చరించారు.

## అవయవ దాతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు

**ప్రజాశక్తి - ఆరిలోవ :** అవయవదాతలకు అంతిమ సంస్కారాలను ఇకపై రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనుందని, దీనికి సంబంధించి గురువారం ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని రాష్ట్ర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ప్రజల్లో అవయవ దానంపై అవగాహన కల్పించి, బ్రెయిన్‌డెడ్ అయిన వారి అవయవాలను అవసరార్థులకు అమర్చడం ద్వారా వారికి పునర్జన్మను ఇచ్చే జీవన్‌దాన్ కార్యక్రమంలో భాగంగా అవయవ దాతల అంతిమ సంస్కారాలను ఆర్‌డిఒ స్థాయికి తక్కువ కాని అధికారుల నేతృత్వంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు అవసరమైన నియమావళిని పేర్కొంటూ ఏపి ప్రభుత్వ ఉత్తర్వులు చేసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల డాక్టర్ రాంబాబు సంతోషం వ్యక్తం చేశారు. అంత్యక్రియల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు సైతం కేటాయిస్తున్నట్లు తెలిపారు.

# మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

**ప్రజాశక్తి- యంత్రాంగం**

**తగరపువలస :** మేలైన యాజమాన్య పద్ధతులు (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్)పై భీమిలి మండలం, తాటితూరులో గ్రామ రైతులకు గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి శిక్షణ ఇచ్చారు. సంబంధిత యాజమాన్య పద్ధతులు అనుసరిస్తూ పండించిన పంటను ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పిఒ) ద్వారా అమ్ముకునే విధానంపై "పొలంబడి" ద్వారా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కుగాను తాటితూరు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ఎఒ శివకోమలి తెలిపారు. 14 వారాల పాటు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఇప్పటికే విత్తన శుద్ధి జరిగిందని, పొలాల్లో మట్టి పరీక్షకు నమూనాలు సేకరించి విశాఖ ప్రయోగశాలకు పంపించామని తెలిపారు. గ్రామంలో దమ్ములు, ఉడుపులు జరుగుతున్నందున రైతులు తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను ఆమె రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ సిబ్బంది రాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది వి.శ్రీను, బి.శ్రీను, పి.వి.రమణ, గోవింద, చిన్న, శివ తదితరులు పాల్గొన్నారు.



తాటితూరు పొలం బడిలో ఎఒ, రైతులు

### బోనిలో పొలంబడి

**ఆనందపురం :** ఆనందపురం మండలం బోని గ్రామంలో ఉత్తమ పంటల యాజమాన్య పద్ధతులపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, భీమిలి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయ్‌ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సిహెచ్.సంధ్య రత్న ప్రభ రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు ద్వారా పండించే వరి పంటకు ఉన్న మార్కెటింగ్ సదుపాయాలపై రైతులతో చర్చించారు. రెండో విడతలో ఎకరానికి 20 కిలోల యూరియా వేయాలని సూచించారు. ఉడుపులు జరిగిన 15 నుంచి 20 రోజులకు కలుపు గమనిస్తే నామినీ గోల్డ్ 100 ఎంఎల్, ఆల్మిక్స్ 8ఎంఎల్, లేదా కౌన్సిల్ యాక్టివ్ 90 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విఎఎ దిలీప్, రైతులు పాల్గొన్నారు.

# గణాత్మక రసాయనశాస్త్రంపై గీతం కోర్సు



ప్రారంభిస్తున్న అతిథులు, గీతం ప్రతినిధులు

**ప్రజాశక్తి -మధురవాడ :** రసాయన శాస్త్రంలో అణువులు, పదార్థ నిర్మాణం, వాటి గుణాలను కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి ఖచ్చితంగా లెక్కించడానికి ఉపయోగపడే గణాత్మక రసాయనశాస్త్రం నైపుణ్యాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన గురువారం ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సును ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు ప్రారంభించారు. రసాయన శాస్త్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని, ముఖ్యంగా క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో పదార్థ విజ్ఞానం, రసాయన సంకలనాలను అర్థం చేసుకోవడంలో కంప్యుటేషనల్ టెక్నిక్‌లు పరిశోధకులకు ఉపయోగపడతున్నాయన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ, క్వాంటమ్ కెమిస్ట్రీకి ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో గణాత్మక రసాయన శాస్త్రంలో విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్ఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ, రసాయన శాస్త్రంలో కంప్యుటేషనల్ టెక్నిక్ అవసరాన్ని గుర్తించి కెమ్ డ్రా, గుస్సెన్, ఫోర్ట్రాన్ వంటి అంశాల ఆధారంగా సర్టిఫికెట్ కోర్సును రూపొందించామన్నారు. కార్యక్రమంలో కోర్సు కో-ఆర్డినేటర్లు డాక్టర్ అనిక్‌సేన్, డాక్టర్ రాహుల్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# గీతమ్‌ను సందర్శించిన టిసిఎస్ నిపుణులు

**ప్రజాశక్తి -మధురవాడ :** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) గ్లోబల్ అధిపతి, సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.సుధాకర్, మానవ వనరుల విభాగాధిపతి శ్రీరామ్ జోషి గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. టిసిఎస్ సంస్థకు గీతంతో ఉన్న దీర్ఘకాల అనుబంధం దృష్ట్యా విద్యార్థులతో ప్రత్యేకంగా వారు సమావేశమయ్యారు. టిసిఎస్ లీడర్‌షిప్ కనెక్ట్ పేరిట జరిగిన కార్యక్రమంలో వారు ఇంజినీరింగ్, ఎంబిఎ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ఐటి, వాణిజ్యరంగాలలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించారు. టిసిఎస్ సంస్థ ప్రస్తుత పోటీ వాతావరణంలో సవాళ్ళను స్వీకరించి ఎలా ఎదుగుతోందో వివరించారు. నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. టిసిఎస్ నిపుణులు గీతం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాసి, పప్పులతో సమావేశమై సంయుక్తంగా కోర్సుల రూపకల్పన తదితర అంశాలను చర్చించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ వంశీ కిరణ్ సోమయాజుల, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి, గీతం రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ బి.రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### మత్తు మందులు, అబార్షన్ కిట్లు పట్టివేత

**ప్రజాశక్తి- గోపాలపట్నం :** గోపాలపట్నం బాజీ జంక్షన్‌లో కేకే సిల్క్స్ పేరిట బట్టలు షాపు నడుపుతూ, లైసెన్సు లేకుండా మత్తు మందులు (నిద్ర మాత్రలు), సిల్డెనాఫిల్ సిట్రేట్, అబార్షన్ కిట్లు అమ్ముతున్న మల్లిపూడి హరికృష్ణను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిటీ టాస్క్ ఫోర్స్ ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది గురువారం సాయంత్రం దుకాణంపై దాడులు నిర్వహించారు. సుమారు రూ.4 వేలు విలువ చేసే అల్ప్రజోలం మత్తు మందులు, సిల్డెనాఫిల్ సిట్రేట్ (అంగ స్తంభనకు వాడే మందు), అబార్షన్ కిట్లును జప్తు చేసినట్టుగా ఔషధ తనిఖీ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. డ్రగ్ యాక్ట్ ప్రకారం మల్లిపూడి హరికృష్ణపై కేసు నమోదు చేశామని, విచారణ జరిపి బాధ్యులపైన కూడా చర్యలు చేపడతామని తెలిపారు. జప్తు చేసిన మందులను తదుపరి చర్యల నిమిత్తం కోర్టు అప్పగిస్తున్నట్లు చెప్పారు. మందులను లైసెన్స్ మందుల షాపుల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఈ ఆపరేషన్‌లో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

### అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం

**ప్రజాశక్తి - ఆరిలోవ :** విశాలాక్షినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో గురువారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విశాలాక్షినగర్ గీతాంజలి ఫంక్షన్ హాల్ ఎదురు వీధిలోని ఒక అపార్ట్‌మెంట్ మూడో ఫ్లోర్‌లో శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు నివాసముంటున్నారు. గురువారం ఉదయం శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు విధుల నిమిత్తం బయటకు వెళ్లిపోయారు. ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆ అపార్ట్‌మెంటు ఫ్లాట్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అప్రమత్తమై మంటలను ఆపేందుకు ప్రయత్నించారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఫ్లాట్‌లోని హాల్లో ఉన్న ఫర్నీచర్ పూర్తిగా కాలిపోయింది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఫ్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కానీ, పూజ గదిలో దీపం వెలిగి ఉండడమో ప్రమాదానికి కారణం కావచ్చని అనుమానిస్తున్నారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తిని కొనసాగించాలి

### డైట్ ప్రిన్సిపల్ జ్యోతికుమారి

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** నేటి యువత క్విట్ ఇండియా స్ఫూర్తిని కొనసాగించాలని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ సంస్మరణ కార్యక్రమం గురువారం స్థానిక ప్రభుత్వ డైట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏళ్ల క్రితమే స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ ఇంకనూ సమాజంలో ధనిక, పేద అసమానతలు, అవినీతి, మాదక ద్రవ్యాల వినియోగం లాంటి ఎన్నో అవాంఛనీయ, అమానవీయ అవలక్షణాలు పట్టి పీడిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యోద్యమాన్ని ఓ మలుపు తిప్పిన క్విట్ ఇండియా స్ఫూర్తితో వీటన్నింటినీ దేశం నుంచి పారద్రోలాలని యువతకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు జిజిఎస్.నాగేశ్వరరావు, సిఎ.సోమయాజులు, జి.రవి, ఎం.మహలక్ష్మి, జె.మాధవి, పి.హరిణి, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు. క్విట్ ఇండియా నినాదంతో ప్లకార్డులను చేత బట్టి ప్రదర్శనలో ఛాత్రో పాధ్యాయులు పాల్గొన్నారు.

## గంభీరం రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డులు

**ప్రజాశక్తి -ఆనందపురం :** ఆనందపురం మండలంలోని గంభీరం రిజర్వాయర్ వద్ద వృక్ష ఫౌండేషన్, మేము సైతం సొసైటీ ఆధ్వర్యాన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల ఇంజినీరింగ్ విద్యార్థుల ఇద్దరు మృతిచెందడంతో ఈ ప్రమాదాలు పునరావృత్తం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రమాదం జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినట్లు వృక్ష ఫౌండేషన్ ఫౌండర్ కాకర సురేష్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేము సైతం సేవా సొసైటీ ఫౌండర్ అక్కిరెడ్డి దేవుడుబాబు, వృక్ష ఫౌండేషన్ ప్రతినిధులు కె.కిరణ్, సిహెచ్.నాయుడు, ఉప్పాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

## ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** మండలంలోని తాటితూరులో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ స్థానం నుంచి డిఎల్ఎస్ఎ జడ్జి హాజరై ఉచిత న్యాయ సహాయం ఎవరు, ఎలా పొందవచ్చునో అవగాహన కల్పించారు. తహశీల్దార్ పి రామారావు, ఎండిఒ డాక్టర్ వి.జానకి, భీమిలి సిఐ రమేష్, ఎస్ఐ జి హరీష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

## నూతన క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన

**ప్రజాశక్తి-లీగల్ :** నూతన క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్‌యు) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విశాఖ జిల్లా కోర్టుల సముదాయం గేటు వద్ద విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన న్యాయవాదులు నిరసన తెలిపారు. నూతన క్రిమినల్ చట్టాలను వెంటనే ఉపసంహరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐలు విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు బి.వి.రామాంజనేయరావు, ప్రధాన కార్యదర్శి నూకల వెంకటేశ్వరరావు, కార్యవర్గ జిల్లా నాయకులు బగాది తులసీదాస్, పూర్ణిమ, అప్పలరెడ్డి, మణి, సిహెచ్ ఆనందరెడ్డి, నాగేశ్వరరావు, మణికంఠ, పి.నర్సింగరావు తదితరులు ప్రసంగించారు. వలసచట్టాల స్థానంలో కొత్త చట్టాలనే పేరు చెప్పి 85 నుంచి 90 శాతం పాత చట్టాలనే పునరావృతం చేశారని, అలాంటప్పుడు చట్టాలను ఎందుకు మార్చారని ప్రశ్నించారు. నూతన చట్టాలలో కోర్టుల అధికారాలను తగ్గించి, పోలీసులకు అపరిమితమైన అధికారాలను కట్టబెట్టారని, అంతేకాక పౌరహక్కులను హరించే అనేక నష్టకరమైన సెక్షన్లను చేర్చారని, ఈమార్పులు మొత్తంగా ఇటు న్యాయవాదులకు ఇబ్బందికరమని, అటు పౌరసమాజానికి హానికరమని విమర్శించారు. ఈ నూతన క్రిమినల్ చట్టాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు, పాకా సత్యనారాయణ, ఆనందరెడ్డి, అప్పలరెడ్డి, భాస్కర్, పూర్ణిమ, నాగేశ్వరరావు, శాస్త్రి, గుడిపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

## ఎపి గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక సిహెచ్‌సి, యుపిహెచ్‌సి వైద్యులు విద్యార్థినులను పరీక్షించి మందులు అందజేశారు. ఆరోగ్య పరంగా పలు సూచనలు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక 15వ మెట్రో పాలిటిన్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపల్ జి.జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎపిఐఐసి గ్రీన్ బెల్ట్ స్థలం కబ్జా

**ప్రజాశక్తి -గాజువాక :** పెదగంట్యాడ ఎపిఐఐసికి చెందిన గ్రీన్ బెల్ట్ స్థలాన్ని కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. 200 గజాల విస్తీర్ణంలో సుమారు రూ.కోటి విలువ చేసే స్థలాన్ని కబ్జా చేశారు. అధికార కూటమికి చెందిన వ్యక్తి కబ్జా చేయడంతో చర్యలు తీసుకోవడానికి ఎపిఐఐసి అధికారులు చొరవ చూపడం లేదు. ఈ ఏరియాలో ఉన్న పరిశ్రమల కాలుష్య నివారణ నిమిత్తం చెట్లు పెంచడానికి గ్రీన్ బెల్ట్ స్థలాన్ని అప్పట్లో కేటాయించారు. ఆ స్థలం వీరికి ఆదాయ వనరుగా మారింది. ఇప్పటికే కాలుష్యంతో స్థానిక ప్రజలు అనేక రోగాల బారిన పడుతుంటే, గ్రీన్ బెల్ట్ స్థలాన్ని కూడా కబ్జా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కళ్లముందే నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, ఇంతవరకు ఎలాంటి నోటీసు ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో వైసిపి నాయకులు కన్ను ఈ స్థలంపై పడింది. ఎన్నికల ముందు కావడంతో దీన్ని అప్పట్లో వదిలేసారు. ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం రావటంతో స్థలానికి రెక్కలు వచ్చాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎపిఐఐసి మేనేజర్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా, తమ సిబ్బందిని పంపించి, పరిశీలించి పనులు నిలుపుదల చేస్తామని తెలిపారు.


గ్రీన్ బెల్ట్ స్థలంలో అక్రమ నిర్మాణం

# ఆసుపత్రి ఎదుట మృతుని కుటుంబీకుల ఆందోళన



లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ వద్ద ఆందోళన చేస్తున్న తండ్రి రమణారెడ్డి, బంధువులు

## డాక్టర్ ఎంబిబిఎస్ కాదు.. లైసెన్స్ రద్దుచేయాలని డిమాండ్

**ప్రజాశక్తి-సీతమ్మధార :** వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ కుమారుడు చనిపోయాడని కుటుంబ సభ్యులు లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మృతుని తండ్రి రమణారెడ్డి మాట్లాడుతూ డెంగీ జ్వరంతో బాధపడుతున్న తమ కుమారుడు బిటెక్ మూడో సంవత్సర విద్యార్థి ధనుష్‌రెడ్డి (21)ని అక్కయ్యపాలెం సాయిబాబా గుడి పక్కన ఉన్న లక్ష్మీ గాయత్రి హాస్పిటల్‌లో గత నెల 19వ తేదీన చేర్పించామని చెప్పారు. 20వ తేదీన ధనుష్‌రెడ్డికి ఎటువంటి వైద్య పరీక్షలూ చేయలేదని, తన భార్య, తన చెల్లి ప్రశ్నిస్తే డాక్టర్ ఇంకా రాలేదని చెప్పారని తెలిపారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో ఒక ఇంజక్షన్ ఇచ్చారని, దీంతో దనుష్‌రెడ్డికి తలబరువు ఎక్కువడంతోపాటు పల్స్ పడిపోయిందని తెలిపారు. వెంటనే డాక్టర్ సంప్రదిస్తే వచ్చి చూసి పరిస్థితి క్రిటికల్‌గా ఉందని వేరే హాస్పిటల్‌లో జాయిన్ చేయమని సలహా ఇచ్చారని చెప్పారు. రాత్రి 2:30 సమయంలో వేరే ఆసుపత్రికి తీసుకెళ్లామని, 3.30 గంటల సమయంలో తమ కుమారుడు చనిపోయాడని తెలిపారు. కేవలం లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడి చనిపోయాడని ఆరోపించారు.

ఆ డాక్టర్ ఎంబిబిఎస్ కాదని తెలిసిందని, ఇటువంటి డాక్టర్ హాస్పిటల్ లైసెన్స్ రద్దు చేసి, వెంటనే ఆ హాస్పిటల్‌ను మూసివేయించాలని కోరారు. తమలాగా ఎవరు బాధపడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, హాస్పిటల్ వద్ద ఆందోళన చేయకూడదని సముదాయించి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం స్టేషన్‌లో మృతుని తండ్రి ఫిర్యాదుచేశారు.

## నిర్వాసిత కాలనీ అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి -గాజువాక :** నిర్వాసిత కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని స్టాండింగ్ కమిటీ సభ్యులు పులి లక్ష్మీబాయి అన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా సిపిఐ నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు గురువారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెదగంట్యాడ నిర్వాసితకాలనీలో పారిశుధ్యం, మంచి నీరు, పార్కుల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ, టిడిపి నాయకులు పులి వెంకటరమణ రెడ్డి, ములకలపల్లి పెంటయ్య, రామిరెడ్డి పాల్గొన్నారు.

## ఆదర్శ్ కాలేజీలో స్కిల్ ఓరియంటెడ్ కోర్సులు

**ప్రజాశక్తి- పెందుర్తి:** స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో స్కిల్ ఓరియంటెడ్ బికాం, బిఎస్ఎఫ్ఐ కోర్సులు ప్రారంభించినట్లు కళాశాల సెక్రటరీ టి.థియోఫిలాస్ తెలిపారు. రాష్ట్రంలో బికాం బిఎస్ఎఫ్ఐ కోర్సుకు అనుమతుల పొందిన కాలేజీల్లో విశాఖలో ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ఒక్కటే ఉందని వివరించారు. సెక్టర్ స్కిల్ కౌన్సిల్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్, ఆంధ్ర యూనివర్సిటీ సంయుక్తంగా ఈ కోర్సులను రాష్ట్రంలో పది కాలేజీలకు మాత్రమే కేటాయించాయని తెలిపారు.

# ఎస్ఎంసి కమిటీ మెంబర్లు ఎన్నిక

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**విశాఖలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలను గురువారం నిర్వహించారు. చైర్మన్లు, మెంబర్లను ఎన్నుకున్నారు.**

**ములగాడ :** జివిఎంసి హైస్కూల్లో నిర్వహించిన ఎస్ఎంసి ఎన్నికల్లో ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మెంబర్లను ఎన్నుకున్నారు. వీరికి నియమ నిబంధనలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్‌ఇ. పద్మజ, సీనియర్ ఉపాధ్యాయులు ఎంఎస్.ప్రకాశరావు, పి.విజయ్‌కుమార్ వివరించారు. అనంతరము పాఠశాల చైర్మన్‌గా అబ్దుల్ సలీమ్‌ను, వైస్ చైర్‌పర్సన్‌గా సోదా పావనిని ఎన్నుకున్నారు. విద్యార్థుల అభివృద్ధికి అందరం కలిసి కృషి చేద్దామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**మధురవాడ :** జివిఎంసి 5, 6, 7 వార్డుల పరిధిలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలు నిర్వహించారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయా ప్రధానోపాధ్యాయులు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల చైర్మన్‌గా మల్లయ్యపాలేనికి చెందిన జి.అచ్యుతరావు, రాజీవ్‌గృహకల్పకు చెందిన నూకరత్నం వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సునీల్ శర్మ (వాంబే) కాలనీ ఉన్నత పాఠశాలలో పెంకి శంకర్ చెర్మన్‌గా, వైస్ చెర్మన్‌గా లావణ్యను ఎన్నుకున్నారు.

### ఎస్ఎంసి ఎన్నికలో రాజకీయ జోక్యం..

**భీమునిపట్నం :** పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం గురువారం పలు పాఠశాలల్లో నిరూపితమైంది. జివిఎంసి మూడో వార్డు పిఎన్ఎం జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికను ఉపాధ్యాయులు ఎం.ప్రసన్న, ఎం.రమాదేవి, డి.నూకరాజు సహకారంతో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వెంకట సంతోష్ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో నిర్వహించారు. 197 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు గాను, 105 మంది (60 శాతం) హాజరయ్యారు. కోరం సరిపోవడంతో ఎన్నిక నిర్వహించారు. ఈ పాఠశాలలో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు పోటీ పడ్డ వారిని చేతులు ఎత్తి తమ ఆమోదాన్ని తెలుపుతూ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అప్పికొండ బాలకృష్ణ, ఉపాధ్యక్షునిగా బి.లీలావతి ఎన్నికయ్యారు. ఇద్దరు కోఆప్టెడ్ సభ్యులు, ఆరుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు కమిటీలో హెచ్‌ఎం, సీనియర్ ఉపాధ్యాయులు, వార్డు కార్పొరేటర్, అంగన్వాడీ కార్యకర్త, ఎఎన్ఎం, మహిళ సమాఖ్య అధ్యక్షులు ఉండనే ఉన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికైన వారు వైసిపికి చెందిన వారుగా భావించిన కొంత మంది టిడిపి నాయకులు పాఠశాలకు చేరుకుని మరలా ఎన్నిక నిర్వహించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చారు. కుదరదని, నిబంధనల ప్రకారమే ఎన్నిక జరిగిందని ఉపాధ్యాయులు తెగేసి చెప్పారు. రాజకీయ జోక్యం తగదని ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు టిడిపి నాయకులతో వాదనకు దిగారు. సమాచారం అందుకున్న ఎంఇఒ ఎం.శివరాణి, పోలీసులు పాఠశాలకు చేరుకున్నారు. వాగ్వివాదానికి దిగిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆ సమయంలో లేక పోవడం గమనార్హం.


పిఎన్ఎం జివిఎంసి ప్రాథమిక పాఠశాలలోఉపాధ్యాయులతో వాగ్వివాదం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

### కోరం లేక రెండు చోట్ల ఎన్నిక వాయిదా

**భీమునిపట్నం :** భీమునిపట్నం మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 98 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, గురువారం 96 పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక లు జరిగాయి. 66 మండల పరిషత్, జివిఎంసి ప్రాథమిక పాఠశాలలకు గాను 47 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. 11 యుపి పాఠశాలల్లో కూడా ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. 21 ఉన్నత పాఠశాలలకు గాను 14 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 17 ప్రాథమిక, 7 ఉన్నత పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా ఎన్నిక జరిగినట్లు ఎంఇఒ ఎం.శివరాణి తెలిపారు. కోరం లేక మండలంలోని మజ్జివలస, జివిఎంసి రెండో వార్డు పరిధి జీరుపేట ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికను వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు.

ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తీసుకునే చర్యల్లో భాగంగా నార్త్ సబ్ డివిజన్ ఎసిపి, సునీల్, భీమిలి సిఐ రమేష్‌తో కలిసి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

**సింహాచలం :** అడివివరం జెడ్‌పిహెచ్ స్కూల్లో గురువారం జరిగిన స్కూల్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 15 మందిని స్కూల్ కమిటీ సభ్యులుగా విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా జొన్నాడ భాస్కరరావు, వైస్ చైర్మన్‌గా రాళ్లపాటి తులసి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈమంది పైడిరాజు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్నికైన వారిని వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహులు అభినందించారు. కమిటీ సభ్యులను 98వ టిడిపి అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షులు బాబు అభినందించారు

**ఆనందపురం :** మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 1కేజీబీవీ పాఠశాల, 7 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, 63 మండల పరిషత్తు పాఠశాలల్లో వెల్లంకి-2 పాఠశాల తప్ప మిగతా అన్ని చోట్ల ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యాన ఎన్నికలు నిర్వహించారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా బంటుబిల్లి లక్ష్మి, వైస్ చైర్మన్‌గా ఆకుల వెంకటరమణ, గొట్టిపల్లి స్కూల్ కమిటీ చైర్మన్‌గా వెన్ని నారాయణరావు, వైస్ చైర్మన్ ఎద్దు రమణమ్మ, ముచ్చర్ల స్కూల్ కమిటీ చైర్మన్‌గా పొంత్రడంకి అప్పల రమణ, సిర్లపాలెం స్కూల్ కమిటీ చైర్మన్‌గా కోరాడ గౌరి, వైస్ చైర్మన్‌గా పేకేటి సంతోష్ కుమారి, తర్లువాడ స్కూల్ కమిటీ చైర్మన్‌గా మజ్జి రాంబాబు, వైస్ చైర్మన్‌గా విజయ్‌కుమారి, బోని స్కూల్ కమిటీ చైర్మన్‌గా కాళ్ల ఆదినారాయణ, వైస్ చైర్మన్‌గా లింగాల చిట్టితల్లి ఎన్నికయ్యారు. ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఇఒ-2 గంగరాజు తెలిపారు.

**పద్మనాభం :** మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 61 ప్రభుత్వ పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించారు. 59 పాఠశాలలలో ఎన్నికలు పూర్తయినట్లు ఎంఇఒ- 2 బాబులాల్ తెలిపారు. అనంతవరం, కె.కొవ్వాడ గ్రామాల్లో ఎన్నికలు జరగలేదని తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

## కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

**ప్రజాశక్తి-అనకాపల్లి**

ఆగస్టు 15వ తేదీన స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేలా వేడుకలను నిర్వహించాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాల్స్ ఏర్పాటు వంటి కార్యక్రమాలకు ఆయా విభాగాలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులతో పాటు అందరూ ఈ వేడుకలకు ఆహ్వానితులేనని పేర్కొన్నారు. స్టేజ్ అలంకరణ, సీటింగ్ ఏర్పాటు, స్టాల్స్ ఏర్పాటు, సౌండ్ సిస్టం, మైదానంలో అవసరమైన మేరకు పనులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందుగానే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అందరికీ సరిపడా తాగునీరు సమకూర్చాలని చెప్పారు. పోలీసు, ఎన్‌సిసి విభాగాలు గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణకు సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని కోరారు. అధికారులందరూ సాంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి ఈ వేడుకలకు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి, ఎఎస్‌పి విజయభాస్కర్, ఇన్చార్జి డీఆర్వో వై.శ్రీనివాసరావు, అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, చిత్రంలో జెసి జాహ్నవి, ఎఎస్‌పి, డిఆర్‌ఒ, ఆర్‌డిఒ



కోర్టు ఆవరణలో న్యాయవాది, ఎస్‌ఎఫ్‌ఐ, సిఐటియు నేతలు

## ఎస్‌ఎఫ్‌ఐ, సిఐటియు నేతలపై కేసు కొట్టివేత

**ప్రజాశక్తి - యలమంచిలి**

అచ్యుతాపురం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థిని మృతి చెందిన నేపథ్యంలో బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియు నాయకులు వినతిపత్రం ఇస్తుండగా పోలీసులు పెట్టిన కేసులో నేరం రుజువు కాకపోవడంతో ఆ కేసు కోర్టు కొట్టివేసింది. నాటి విద్యాశాఖ మంత్రి గండా శ్రీనివాసరావు, ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇవ్వడానికి వెళితే పోలీసులు లాఠీఛార్జి చేసి ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియు నాయకులు ఎస్‌వి.నాయుడు, కె.సోమునాయుడు, ఆర్ రాము, వై.అప్పలరాజుపై పోలీసులు 248 - 17 కేసే నమోదు చేశారు. దీనిపై వాదోపవాదనలు అనంతరం నేరం రుజువు కాకపోవడంతో న్యాయం స్థానం కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించిందని లాయర్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్‌పి దీపిక

## ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ నందు హెూంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన జి.శ్రీనివాసరావు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3,83,400 చెక్‌ను గురువారం తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా అందజేశారు. అలాగే మృతి చెందిన హెూమ్ గార్డ్ భార్య తులసి రామలక్ష్మికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మరణించిన హెూంగార్డ్ శ్రీనివాసరావును సేవలను ప్రత్యేకంగా గుర్తుచేసుకొని ఆయన భార్య తులసి రామలక్ష్మిని ఓదార్చి భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, ఏ.ఓ బి.శారద, సూపరింటెండెంట్ వరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ వంశీ పాల్గొన్నారు.

## దూర విద్యలో అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (దూర విద్యా విధానం) ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు 2024-2025 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్, అయ్యన్న జూనియర్ కాలేజీ స్టడీ సెంటర్ల కో-ఆర్డినేటర్ డాక్టరు ఖాశీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాల వయస్సు, చదవటం, రాయడం పరిజ్ఞానం కలవారు పదవ తరగతి పరీక్షలు ఫెయిలైన వారు, చదువుతూ మధ్యలో మానేసిన వారు పదో తరగతిలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. 15 ఏళ్లు నిండి పదవ తరగతి పూర్తయిన వారు, ఇంటర్మీడియట్ ఫెయిలైన వారు, చదువుతూ మధ్యలో మానేసిన వారు ఇంటర్మీడియట్ కోర్సులో చేరి ఐదు సబ్జెక్టులతో సింగిల్ సిట్టింగ్ విధానం ద్వారా కోర్సు పూర్తి చేయవచ్చుని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 31వ తేదీ లోగా టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులలో చేరవచ్చునని పేర్కొన్నారు. వివరాల కోసం స్టడీ సెంటర్ల పనివేళల్లో నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు.

## పంద్రాగస్టు పరేడ్‌కు చిననందిపల్లి విద్యార్థిని

**ప్రజాశక్తి-దేవరాపల్లి :** మండలంలోని చిననందిపల్లి గ్రామానికి చెందిన సబ్బవరపు దివ్య నయన విజయవాడలో ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ పరేడుకు ఎంపికైంది. ఈ మేరకు దివ్య నయన తండ్రి సబ్బవరపు రమణ బుధవారం స్థానిక విలేకర్లకు తెలియజేశారు. విశాఖలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతుంది.



### జిఒ 117 రద్దు చేసిన తరువాతే

## ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

**ప్రజాశక్తి-చోడవరం**

జిఒ 117ను రద్దు చేసిన తరువాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో మండల యుటిఎఫ్ నాయకులతో కలిసి ఎంఇఒ కె.సింహాచలంకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయి మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా పాఠశాల విద్యా సమస్యలు ఇంకా పరిష్కరించబడలేదని వాపోయారు. పాత ప్రభుత్వం అమలు చేసిన జిఓ 117 వలన ప్రభుత్వ పాఠశాలలు దివాలా తీశాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక జిఒ 117 రద్దు అవుతుందని ఉపాధ్యాయులందరూ ఎదురు చూశారని తెలిపారు. 117ను రద్దు చేయకుండానే, ఆ జిఓ ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం సరి కాదని పేర్కొన్నారు. కాబట్టి జీఓ 117 రద్దు చేసి, పాత జిఒ 53 ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. మెగా డిఎస్‌సిలో పోస్టులు భర్తీ చేయడానికి కూడా జిఓ 117 ఆటంకమని చెప్పారు. 1 నుండి 5వ తరగతి వరకు ఒకే పాఠశాలలో తరగతులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ చోడవరం మండల అధ్యక్షులు బొడ్డపాటి రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి నందికోళ్ల గణేష్, గౌరవ అధ్యక్షులు ఉగ్గిన సత్యనారాయణ బాబ్జీ, ఉపాధ్యక్షులు ఆరిపాక రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్‌ల సభ్య రైతులు వివరాలు అందజేయాలి

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్య రైతులు తమ పూర్తి వివరాలను అందజేయాలని బుచ్చయ్యపేట, తురకలపూడి పిఎసిఎస్‌ల కార్యదర్శులు పిన్నమరెడ్డి శ్రీనివాసరావు, పైడి రవి అన్నారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్న నేపథ్యంలో సభ్యత్వం కలిగిన రైతుల తమ ఆధార్ నకలు, భూమి పాస పుస్తకం నఖలు లేదా, వన్ బి వివరాలను అందజేయాలని కోరారు. కంప్యూటరీకరుణ అనంతరం ఆన్లైన్ లావాదేవీలు సహకార సంఘాల్లో జరుగుతాయని తెలిపారు.

**కశింకోట :** మండలంలోని నర్సింగబిల్లి పిఎసిఎస్ సభ్య రైతులు భూమి పాస్ బుక్, ఆధార్ కార్డు, సెల్ నెంబర్ తీసుకొని వచ్చి సంఘం కార్యలయంలో నమోదు చేసుకోవాలని సంఘం కార్యదర్శి నక్క అచ్చయ్య నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

**అనకాపల్లి :** తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (అన్నపూర్ణ బ్యాంక్)లో సభ్యత్వం ఉన్న రైతులందరూ తమ ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నెంబరును సంఘ కార్యాలయంలో అందించాలని ఆఫీషియల్ ఇన్చార్జి వివివి సత్యకుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ వివరాలను తప్పనిసరిగా సొసైటీలో అందచేయాలన్నారు.

## ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి -అనకాపల్లి :** నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ పరీక్ష 2024-25కు ఎనిమిదవ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోనే ప్రభుత్వ ఎయిడెడ్, జిల్లా పరిషత్, మున్సిపల్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, మౌలిక సౌకర్యాలు లేని ప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదవ తరగతి చదువుతూ, కుటుంబ ఆదాయం రూ.3.50 లక్షలకు మించకుండా ఉన్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 8న జరగనున్న ఈ పరీక్షకు ఓసి బిసి విద్యార్థులు రూ.100, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.50 కట్టిన దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ సెప్టెంబర్ 6, పరీక్ష ఫీజు చెల్లించడానికి ఆఖరి తేదీ సెప్టెంబర్ 10 అని, పరీక్ష ఫీజు ఆన్లైన్ దరఖాస్తులో ఉంచిన ఎస్బిఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వారి కార్యాలయం వెబ్ సైట్ www.bse.ap.gov.in లేదా జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## పారిశుధ్య నిర్వహణకు చర్యలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పారిశుధ్య సిబ్బంది తగినంత మంది లేకున్నా ఎప్పటికప్పుడు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఈవో ఈశ్వరరావుతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు తెలిపారు. సచివాలయం-3లో విద్యుత్ నగర్ వినాయకుడు గుడి దగ్గర చెత్తలను తీసే రిక్షాను గురువారం ప్రారంభించారు. తుమ్మపాల గ్రామాన్ని శుభ్రంగా ఉంచడానికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో 14, 17 వార్డుల మెంబర్లు కొయ్య భాస్కర్, తర్రా సత్యారావు, సూరంపూడి రఘు రామయ్య, పోరాడ శ్రీనివాసరావు, మొల్లి భాను, వారాది సత్యనారాయణ, మలుగు సత్యనారాయణ, మొలుగు శ్రీను, బాల త్రిపుర సుందరి పాల్గొన్నారు.

## డైట్‌లో వినియోగదారులకు అవగాహన సదస్సు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** స్థానిక డైట్ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఇంటిగ్రేటెడ్ (అంబుడ్స్మన్) మీద అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ ఆర్‌బిఐ మేనేజర్ పి.జయలక్ష్మి వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడం, ఎవరికి ఫిర్యాదు చేయాలి, దేనిపై ఫిర్యాదు చేయాలో, ఎన్ని రోజుల్లో చేయాలో వివరించారు. కోటక్ మహేంద్ర బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ మిస్టర్ కె విజయకుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలు కస్టమర్ల సేవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, ఎంబిఏ విభాగాధిపతి డాక్టర్ రామ్ కుమార్, ఎంబీఏ అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిన వైస్ ఎంపిపి దేవి

**ప్రజాశక్తి- మునగపాక :** మునగపాక వైస్ ఎంపీపీ చిందాడ దేవి, వైసీపీ నాయకుడు వరహాలు వెంకట్‌లు స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో గురువారం జనసేన పార్టీలో చేరారు. వారికి శాలువలు కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, దొడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుందరపు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి స్వప్న

## ఈ-పంట నమోదుపై విఆర్‌ఒలతో సమీక్ష

ప్రజాశక్తి-కశింకోట : ఈ-పంట, కౌలు రైతుల గుర్తింపుపై గ్రామ రెవిన్యూ అధికారులతో కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దారు సురేష్ నాయుడు మాట్లాడుతూ రైతుల పంటల నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్నా, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## కృష్ణ, గోదావరి నదీ జలాలు పున: పంపిణీ జరగాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : కృష్ణ, గోదావరి నదీ జలాలు పున:పంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడుకోవాలని కోరుతూ గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రైతు సంఘం నాయకులు మర్రి బాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, గురుబాబు, కొరిబిలి శంకర్రావు, పప్పల ఈశ్వర్రావు, లక్ష్మీ పాల్గొన్నారు.

## పశుగణనపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఈనెల 6 నుంచి 8 వరకు నిర్వహించిన 21వ పశుగణన డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బెహరా ప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ హాజరై పశుగణన శిక్షణకు సంబంధించిన పోస్టర్లు, శిక్షణ కరదీపిక, సెన్సస్ షెడ్యూల్సు విడుదల చేశారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బందికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎ సిహెచ్ గణేష్, ఏడి డాక్టర్ సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్ రావు, డివిజన్ స్థాయి ఎన్యూమేరేటర్లు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఎఎస్‌ఐ మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు : కె కోటపాడు పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎఎస్‌ఐగా ప్రమోషన్‌పై సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన గొర్లె రాములునాయుడు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన స్వగ్రామం కె.కోటపాడు మండలం కేజే పురం. ఇక్కడే భార్యా పిల్లలు ఉంటున్నారు. జిల్లా ఎస్పీ దీపిక ఆదేశాల ప్రకారం గురువారం ఏఆర్ పోలీసులచే గౌరవ వందనంతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

## నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు : విద్యుత్ లైన్ల మరమ్మతు నిమిత్తంగా ఎ.కోడూరు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల ఎ.కోడూరు, సింగన్న దొరపాలెం, సూరెడ్డిపాలెం, పొడుగుపాలెం గ్రామాలలో విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## డాక్టర్ శ్యామల మృతిపై విచారణ జరపాలని వినతి

ప్రజాశక్తి-కశింకోట : 2020 ఆగస్టు 4న కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద పోలవరం కాలువలో అనుమానాస్పదంగా మృతి చెందిన డాక్టర్ మళ్ళ శ్యామల మతిపై దర్యాప్తు జరిపించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె బంధువులు దొడ్డి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ సీఎం తరుపున అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అర్జీని స్వీకరించారు.

## రూ.15 వేలు పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మంచానికి పరిమితమై ఉన్న వికలాంగులకు రూ.15000 పింఛను అందజేయాలని జిల్లా పేద ప్రజల హక్కుల సమితి కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావు కోరారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఆర్ శివరాంపురం సచివాలయం పరిధిలోని అప్పంపాలెం గ్రామానికి చెందిన వెచ్చం రమణమ్మ శత శాతం వైకల్యంతో ఎటువంటి పనులు చేసుకోలేకుండానే ఉన్నారని, ఆమె ప్రభుత్వం వికలాంగ పింఛను రూ. 6000 మాత్రమే ఇస్తుందని, ఆమెకు రూ.15వేలు ఇవ్వాలని కోరారు.

# పింఛన్ల కోసం ఎదురుచూపులు..?

- ఏడాదిగా ఇవ్వని కొత్త పెన్షన్లు
- అర్హులైన పలువురికి రద్దు
- పునరుద్ధరించాలని బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త పెన్షన్ల కోసం పలువురు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు పది నెలల ముందు నుండి కొత్త పెన్షన్లను మంజూరు ఆపేసింది. మరో వైపు పలు కారణాలతో అర్హులైన వారి పింఛన్లు రద్దు చేసింది. ఈ ఏడాది కాలంలో పలువురు పింఛన్లకు అర్హత సాధించనవారు ఉన్నారు. వీరంతా తమకు పింఛన్లు మంజూరు చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

2014-19 మధ్య భర్త చనిపోతే భార్యకు ఎటువంటి షరతులు లేకుండా (స్పాట్) పెన్షన్‌ను అందించేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత కొన్నాళ్ల పాటు నెలనెలా కొత్త పింఛన్లు మంజూరు చేశారు. ఆ తర్వాత ఆరు నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లు మంజూరు చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఎన్నికలకు 10 నెలల ముందు నుండి కొత్త పింఛన్లు మంజూరును వైసిపి ప్రభుత్వం నిలిపివేసింది. ఈ ఏడాది కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 200 మందికి పైగా మృతి చెందడంతో వారి భార్యలు వితంతువులుగా మారారు. మరికొంత మంది వృద్ధాప్య పింఛన్లకు అర్హత సాధించారు. వీరికి నేటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. వీరంతా కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

### రద్దయిన పెన్షన్లకు మోక్షం ఎప్పుడు?

గత 15, 20 ఏళ్ల నుండి పింఛన్లు పొందుతున్న వారికి వివిధ కారణాలతో వైసిపి ప్రభుత్వం పింఛన్లు రద్దు చేసింది. అందులో ప్రధానంగా తల్లీ కూతుర్లు తమ భర్తలను కోల్పోయి, ఒకే రేషన్ కార్డులో ఉండగా, వారిద్దరికి ఎప్పటి నుండో వితంతు పింఛన్లు ఇస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఒకే రేషన్ కార్డులో ఉన్న తల్లీ కూతురు ఇద్దరు వితంతు పింఛన్లు ఉంటే వాటిలో ఒక పెన్షన్‌ను రద్దు చేశారు. ఈ విధంగా మండలంలో సుమారు 50 పెన్షన్ల వరకు నిలిచిపోయాయి. వీరిలో అత్యధిక మంది వృద్ధులు. అయినా సరే ఒకే రేషన్ కార్డులో ఉన్న ఇద్దరికి పెన్షన్లు ఉన్నాయన్న నెపంతో వైసిపి సర్కార్ ఒకరికి రద్దు చేసింది.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలుగుదేశం తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకే రేషన్ కార్డులో ఉన్నా కూడా అర్హులైతే రెండు పింఛన్లు కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరంతా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకే రేషన్ కార్డుపై రెండు పింఛన్లు ఉన్నాయన్న పేరుతో రద్దు చేసిన వారికి, వివిధ కారణాలతో రద్దు చేయబడిన వారిలో అర్హులైన వారికి తక్షణమే టిడిపి కూటమి ప్రభుత్వం పెన్షన్లను పునరుద్ధరించాలని, ఈ ఏడాది కాలంలో పింఛన్లకు అర్హత సాధించిన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

### వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నాను



నా వయస్సు 90 సంవత్సరాలు. నా భర్త 60 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. 30 రూపాయలు పెన్షన్ ఉన్న నాటి నుండి నాకు పింఛను వచ్చేది. నా కుమార్తె వెన్నెలకోట మాణిక్యం భర్త కూడా మృతి చెందడంతో నా కుమార్తె, నేను ఒకే రేషన్ కార్డు కలిగి ఉన్నాం. నా కుమార్తెకు కూడా వితంతు పింఛను వచ్చేది. అయితే ఒకే రేషన్ కార్డు మీద రెండు పింఛన్లు ఉన్నాయన్న నెపంతో నాలుగు సంవత్సరాల నుండి నాకు పింఛను ఇవ్వడం లేదు. వృద్ధాప్యంలో ఉన్న నేను ఏ పనులూ చేయలేను. పెన్షన్ ఆపేయడంతో పూట గడవడం కష్టంగా ఉంది. నా బాధను అర్థం చేసుకొని పింఛను ఇవ్వాలి.

- గొంపా దేవుడమ్మ, వితంతువు, దిబ్బిడి

### కొత్త పింఛన్లు మంజూరు చేయాలి



నా వయస్సు 65 సంవత్సరాలు. నా భర్త ఏడాది క్రితం చనిపోయారు. వితంతు పెన్షన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేశాను. నేటి వరకు పెన్షన్ మంజూరు చేయలేదు. ప్రభుత్వం వెంటనే పెన్షన్ మంజూరు చేయాలి.

- జర్త చింతల్లి, దిబ్బిడి

### పింఛను తిరిగి ఇవ్వాలి



నా వయస్సు 80) సంవత్సరాలు. నా భర్త చనిపోవడంతో చనిపోవడంతో 20 ఏళ్ల నుండి నాకు పింఛను వస్తుంది. అప్పటి నుండి నా కుమార్తె సుంకర ఎర్రయ్యమ్మ ఇంటి వద్ద ఉంటున్నాను. నా కుమార్తె భర్త కూడా చనిపోవడంతో 15 ఏళ్లగా ఆమెకు పింఛను వస్తుంది. నాలుగు సంవత్సరాల క్రితం వరకు నాకు పెన్షన్ రాగా, తరువాత నాకు ఆపేశారు. దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాను. పింఛను తిరిగి ఇవ్వాలి.


- పినపోలు చిలకమ్మ, దిబ్బిడి

# స్వర్ణ పతక విజేత అప్పలరాజుకు అభినందనలు


అభినందిస్తున్న సుజాత ముత్యాలు

ప్రజాశక్తి- పరవాడ : వాడో- ర్యూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుజరాత్ వడోదరలో ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించిన 18వ ఇండిపెండెన్స్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన అరిజిల్లి అప్పలరాజును గురువారం ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు అభినందించారు. 14 రాష్ట్రాలకు చెందిన 1044 మంది 116 విభాగాలలో పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ నుండి విశాఖపట్నం జిల్లా కింగ్ ఆఫ్ కరాటే ఛాంపియన్స్ దోజో చెందిన 10 మంది పాల్గొని 5 స్వర్ణ పతకాలు, 2 రజత పతకాలు, 1 కాంస్య పతకం సాధించారు. ఇందులో 67 కేజీల సీనియర్ పురుషుల విభాగంలో న్యూపోర్ట్ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ అర్జిల్లి అప్పలరాజు స్వర్ణపతకం సాధించాడు. ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీకి చెందడం అప్పలరాజుకు సర్పంచ్ సుజాత ముత్యాలు పూర్తి ఖర్చులు భరించి స్పాన్సర్‌షిప్ అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత ముత్యాలు స్వర్ణ పతక విజేత అప్పలరాజు, చీఫ్ కోచ్ శిహన్ సీహెచ్ శ్రీనివాసరావుని అభినందించారు. భవిష్యత్తులోనూ సహాయం అందిస్తామని చెప్పారు.

# ట్రై జంక్షన్ కేంద్రం గుర్తింపు


సర్వే చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం, అసకపల్లి, గొట్టివాడ గ్రామాలకు సంబంధించి ట్రై జంక్షన్ కేంద్రాన్ని జిల్లా, స్థానిక సర్వే అధికారులు గురువారం సర్వే చేసి గుర్తించి సరి చేశారు. ఇటీవల ఇరువాడ గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కి మూడు గ్రామాల సరిహద్దులను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా సర్వే అధికారులు వెంటనే స్పందించి గురువారం తమ సిబ్బందితో స్థలాన్ని పరిశీలించి మూడు గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దల సమక్షంలో ట్రై జంక్షన్ సరిహద్దును గుర్తించి సర్వే రాళ్లను ఏర్పాటు చేశారు. దీంతో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములకు చెక్ పట్టే పనిలో యంత్రాంగం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, అసకపల్లి సర్పంచ్ కర్రి నరసింగరావు, సర్వే ఏడి ఎస్.గోపాల్ రాజు, జిల్లా ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న, మండల సర్వేయర్ కే. శ్రీనివాసరావు, మూడు గ్రామాల సచివాలయం సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-చోడవరం : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని చోడవరం సిఐ డి.శేఖరం అన్నారు. స్థానిక విద్యార్థి డిగ్రీ కళాశాలలో గురువారం 'పొగాకు, మత్తు పదార్థాల నిషేధం' అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి చేర్చే నేపథ్యంలో అమాయక పేద విద్యార్థులు బలవుతున్నారని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాల వాడకానికి, వాటిని సరఫరా చేయడానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూసర్ల సంతోష్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రామారావు, వేచలపు అర్జునరావు, ఎఐ బీపురుపల్లి దేముడు నాయుడు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని నర్సయ్యపేట గ్రామానికి చెందిన ముమ్మిన శ్రీనివాసరావు అనే భవన నిరాణ కార్మికుడు ప్రమాదంలో మరణించగా, కేంద్ర ప్రభుత్వం మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును మృతుని కుమారుడు అనిల్ కుమార్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ-శ్రమ కార్డు కలిగి ఉండి అసంఘటిత, భవన నిరాణ కార్మికులు ప్రమాదంలో మరణించిన తరువాత వారికి కేంద్ర ప్రభుత్వం నుండి రెండు లక్షల రూపాయలు బీమా పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొసరు తాతారావు, ఆకుల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్క్‌లో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్క్ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కొణతాల లక్ష్మీనారాయణ చేనేత ఉత్పత్తుల ప్రాముఖ్యత విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో చేనేత వస్త్రాలు వాటి చరిత్రకి సంబంధించి విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ కొణతాల బాల సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ ఏఆర్ఎల్.నరసింగరావు, ట్రెజరర్ కెవిఎన్ఆర్‌కె. అచ్యుతరామయ్య, పాలక వర్గం సభ్యులు కళాశాల ప్రిన్సిపల్ పి శిరీష, వైస్ ప్రిన్సిపాల్ బి నవ్య, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినేష్ ఫొగాట్ అనర్హతపై నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న డివైఎఫ్ఐ నేతలు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** పారిస్ ఒలింపిక్స్ నుంచి వినేష్ ఫొగాట్‌ను అన్యాయంగా, ఏకపక్షంగా అనర్హులుగా ప్రకటించడంపై డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒలింపిక్స్ నిర్వహణ కమిటీ చర్యను తీవ్రంగా ఖండిస్తూ ఎఎస్ఆర్.నగర్‌లోని చిట్టిబాబుకాలనీలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ చర్య భారతీయ క్రీడలకు ఎదురుదెబ్బ మాత్రమే కాదని, క్రీడాకారుల నిజాయతీ, క్రీడా స్ఫూర్తిపై దాడి అని తెలిపారు. ఒలింపిక్ మెడల్ లక్షలాది భారతీయ క్రీడాకారుల ఆకాంక్ష అన్నారు. రెజ్లింగ్ క్రీడాకారిణి వినేష్ ఫోగట్ గతంలో క్రీడా శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై పోరాడిన గొప్ప యోధురాలని తెలిపారు. వినేష్ ఫోగట్ అనర్హత చుట్టూ అనేక అనుమానాలు ఉన్నాయని, ఆమె తన సన్నిహితులకు చెప్పలేని విధంగా సహాయక సిబ్బంది, కోచ్ కుట్రలు చేశారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పాత్రపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతుందన్నారు. ఈ విషయంలో రెజ్లింగ్ ఫెడరేషన్ దాని అధికారులపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. వినేష్ ఫోగట్‌కు సంఘీభావం తెలుపుతున్నామని, ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంలో భారతదేశ ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు గౌరీష్, రాజు, కోటయ్య, రాంబాబు, జ్యోతి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు విరాళాల సేకరణ



భెల్ మెయిన్ గేట్ వద్ద విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నేతలు

**ప్రజాశక్తి -గాజువాక :** కేరళ వరద బాధితుల కోసం విశాఖ భెల్ యూనిట్ మెయిన్ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యాన గురువారం మూడు షిఫ్టుల్లో ఉద్యోగుల నుంచి విరాళాలు సేకరించారు. మొత్తం రూ.19 వేలు విరాళంగా వచ్చింది. ఈ కార్యక్రమంలో జిటిపి ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, కె.విజయ్‌కుమార్, సీత నాయుడు, పి.కనకారావు, జి.అచ్చంనాయుడు, కె.నారపరెడ్డి, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

## జగన్‌తో నర్సీపట్నం నేతల భేటీ



మాట్లాడుతున్న జగన్, పక్కనే మాజీ ఎమ్మెల్యే గణేష్

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్** : నర్సీపట్నం నియోజకవర్గ వైసిపి జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసిలు, పార్టీ ముఖ్య నాయకులతో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం,. జగన్ మోహన్‌రెడ్డి గురువారం భేటీ అయ్యారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో నర్సీపట్నం నియోజకవర్గ వైసిపి నేతలతో సమావేశమైన జగన్, ఈ మేరకు త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వారికి జగన్ దిశానిర్దేశం చేశారు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో పాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కార్మికోద్యమ నేత సూర్యనారాయణకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న గోవిందరావు, ఇతర నేతలు

**ప్రజాశక్తి-కొత్తకోట :** కార్మికోద్యమ నేత, సిఐటియు పూర్వ జిల్లా అధ్యక్షులు ఎం. సూర్యనారాయణ 10వ వర్ధంతిని రావికమతం మండలం చీమలపాడు శివారు కల్యాణపులోవలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సూర్యనారా యణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ విద్యార్థి దశనుండి ఎస్ఎఫ్ఐ నాయకుడుగా విద్యార్థుల సమ్యలపై సూర్యనారాయణ పనిచేసారన్నారు.. అనంతరం సిపిఎం సిద్ధాంతానికి అకర్షితలై పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి, సిపిఎం జిల్లా నాయకునిగా ఏజెన్సీలో బాక్సైట్, నాతవరం మండలం సరుగుడులో లేటరైట్ తవ్వకాలకు వ్యతిరేక పోరాటం చేశారన్నారు. కొండపోడు పట్టాలు, ఇతర భూసమస్యలతోపాటు, ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనకు పోరాటం చేశారాన్నరు. .అలాగే సిఐటియు జిల్లా అధ్యక్షునిగాకార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం, ప్రజాసమస్యల పరిష్కారానికి కంకణబద్ధులై పనిచేయడమే నిరంతరం పనిచేయడమే సూర్యనారాయణకు ఇచ్చిన నివాళి అన్నారు కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి కిల్లో సూరిబాబు, గిరిజనులు పాల్గొన్నారు

# ఉత్తమ వరి సాగు పద్ధతులపై అవగాహన




రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది..

**ప్రజాశక్తి -కొత్తకోట** : వ్యవసాయ శాఖ సిబ్బంది అందిస్తున్న సూచనలు, సలహాలు రైతులు పాటిస్తే వరి పంటలో మంచి దిగుబడి సాధించవచ్చని రావికమతం మండల వ్యవసాయధికారి రూప తెలిపారు. గురువారం గుడివాడ గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులతో బ్యాలెట్ బాక్స్ టెస్ట్, పురుగుల మందు పిచికారీలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కెఆర్‌బి పొటాష్ సాల్యూలైజింగ్ బ్యాక్టీరియా వాడే విధానం వివరించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పంటల సాగు, సస్యరక్షణపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**గొలుగొండ** :గొలుగొండ మండలం పాతమల్లంపేట గ్రామంలో పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయశాఖ అధికారి సుధారాణి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథి ఎడిఎ టి.శ్రీదేవి మాట్లాడుతూ,.వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలభించాలన్నారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం ద్వారా పెట్టుబడి తగ్గించి నాణ్యమైన పంట ఉత్పతులు సాధించవచ్చున్నారు. అర్హులైన కౌలు రైతులంతా విఆర్ఒల ద్వారా కౌలు గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు.. వరి పంటల సాగు పద్ధతులు గురించి వివరించారు. ఇ-పంట నమోదు ద్వారా ప్రతి రైతు తమ పంటల వివరాలు రైతు సేవా కేంద్రాలు సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.

# మోడల్ స్కూల్ విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు



హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :** నర్సీపట్నం మండలం వేములపూడిలోని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వేములపూడి ప్రాంతీయ ఆసుపత్రి డాక్టర్ అనూష, ఎంపిహెచ్ఒ ఆనంద్, హెచ్ఎస్ మల్లిబాబు, హెల్త్ అసిస్టెంట్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ సిబ్బందితో పాటు మదర్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, మోడల్ స్కూల్ పిఇటి రాజు పాల్గొన్నారు.

# మండల అధికారులను కలిసిన జనసేన నాయకులు

**ప్రజాశక్తి -పద్మనాభం :** మండల తహశీల్దార్ ఆనంద్‌కుమార్, విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ రమేష్‌ను జనసేన నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. అధికారులను కలిసిన వారిలో జనసేన పద్మనాభం మండల అధ్యక్షులు కురిమిన రామస్వామి నాయుడు, విశాఖ జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ విబి.నాయుడు, నాయకులు ముద్దాడ సూరప్పడు, మజ్జి రమేష్, మజ్జి సురేష్, నాయుడు, సిహెచ్.సోమేష్, మణి తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా స్థానిక సమస్యలను వారికి విన్నవించారు.

# మత్తు పదార్థాల జోలికి పోవద్దు :సిఐ

**ప్రజాశక్తి -కొత్తకోట :** బంగారు భవిష్యత్ కలిగిన విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి దరికి చేరి జీవితం నాశనం చేసుకోవద్దని కొత్తకోట సీఐ అప్పలనాయుడు తెలిపారు. గురువారం కొత్తకోట జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్, ఈవ్‌టిజింగ్, ర్యాగిం గ్, ఓటిపిలో ఫ్రాడ్స్, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులంతా సోదరభావంతో మెలగాలని సూచించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి కార్యకలాపాలు చట్ట వ్యతిరేకమన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకొని వ్యక్తిగతంగా వృద్ధి చెందడంతోపాటు కళాశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, ప్రిన్సిపల్ సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐ అప్పలనాయుడు

## తహశీల్దార్‌గా మహేశ్వరరావు

**ప్రజాశక్తి -కొత్తకోట :** రావికమతం మండల నూతన తహసీల్దార్‌గా ఎసె మహేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేస్తూ శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు. ఎన్నికలు ముగియడంతో తిరిగి మహేశ్వరావునే రావికమతం తహశీల్దార్‌గా పునర్నియామకం చేయగా, ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కారానికి మునుపటిలా సిబ్బంది సహకారాలు అందించాలని కోరారు. ప్రభుత్వ ప్రాధాన్యతల అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని సూచించారు.

## నర్సింగరావు ఆచూకీ లభ్యం

**ప్రజాశక్తి -ఆనందపురం :** మండలంలోని బోని పంచాయతీ రామినేనిపేట గ్రామానికి చెందిన పోతల నర్సింగరావు (54) ఆచూకీ లభ్యమైనట్లు కుమారుడు వీరబాబు తెలిపారు. నర్సింగరావు అదృశ్యమైనట్లు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. నర్సింగరావు అదృశ్యమైనట్లు పేపర్లలో, సోషల్ మీడియా ద్వారా ప్రచారం కావడంతో గురువారం మధ్యాహ్నం ముకుందపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సురేష్ కుటుంబీకులకు ఫోన్ చేశాడు. నర్సింగరావు ఇసుక లోడు పనులకు వచ్చాడని, తమ దగ్గరే ఉన్నాడని చెప్పినట్లు కుమారుడు వీరబాబు మీడియాకు తెలిపారు. నాలుగు రోజులుగా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఆచూకీ లభ్యమవడంతో కుమారుడు ఆనందం వ్యక్తం చేశారు.

## శాఖా గ్రంథాలయంలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి వెంకటరావు

**ప్రజాశక్తి- నక్కపల్లి :** మండలంలోని చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయాన్ని గురువారం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి హెచ్ వెంకటరావు ఆకస్మికంగా సందర్శించారు . గ్రంథాలయానికి సంబంధించి రిజిస్టర్లు, రికార్డులు తనిఖీ చేశారు.గ్రంథాలయం సొంత భవనం మరమ్మత్తు పనులు పరిశీలించారు.గ్రంథాలయాధికారి కె.జనార్ధన్ తో పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎలమంచిలి గ్రంథాలయాధికారి వి.ఆనంద్ పాల్గొన్నారు .

## ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కో-కన్వీనర్‌గా పాపారావు



యర్రంశెట్టి పాపారావు

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :** ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉద్యమ కమిటీ కోకన్వీనర్‌గా యర్రంశెట్టి పాపారావు నియమితులయ్యారు. ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నియమ నిబంధన ప్రకారం ఏటా రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల నూతన కమిటీలు ఎన్నికలు, ఎంపిక జరుగుతాయి. అలాగే నూతన సభ్యత్వ నమోదు చేపడతారు. ఇందులో భాగంగానే వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతీ కృష్ణనాయుడు, రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వరప్రసాద్‌ల సూచన మేరకు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు దరిమిశెట్టి నారాయణరావు ప్రతిపాదన ప్రకారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామపంచాయతీకి చెందిన యర్రంశెట్టి పాపారావును ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉద్యమ కమిటీ కోకన్వీనర్‌గా నియమించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘుసత్యసింహా చక్రవర్తి ప్రకటించారు.

# బుద్ధదేవ్ మరణం తీరని లోటు

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం
- సిపిఎం, ప్రజాసంఘాల సంతాపం, ఘననివాళి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** సిపిఎం సీనియర్ నాయకులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య (80) మరణం బెంగాల్ ప్రజలతో పాటు పార్టీకి, పేద ప్రజలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభ గురువారం అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. లోకనాథంతో పాటు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శంకర్రావు బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో లోకనాథం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉద్యమాలలో ఉంటూ మార్క్సిస్టు పార్టీ నిర్మాణ దశ నుంచి అంచలంచెలుగా ఎదిగారని తెలిపారు. జ్యోతిబసు క్యాబినెట్లో పలు మంత్రి పదవవులతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవి నిర్వహించారని, అనంతరం బెంగాల్ ముఖ్యమంత్రిగా 2000 నుంచి 2011 వరకు 11 ఏళ్ల పాటు పని చేసి బెంగాల్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఉంటూనే నిరాడంబర జీవితాన్ని గడిపారని, అనంతరం కూడా ప్రభుత్వ క్వార్టరు రెండు గదుల ఇంటిలోనే తుది వరకు నివాసం ఉన్నారని, ఆయన కుటుంబ సభ్యులు కూడా ప్రజా రవాణానే వినియోగించి ప్రజాప్రతినిధులకే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. బుద్ధదేవ్ మరణానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెంటకోట శ్రీనివాస రావు, తేలయ్య బాబు, నాయన బాబు, మల్లికార్జున, ఈశ్వరరావు, ఉమామహేశ్వర రావు, నాగిరెడ్డి సత్యనారాయణ, నరసింహమూర్తి, సుభాషిణి, రాజు, చలపతి పాల్గొన్నారు.



పెందుర్తిలో సంతాపం తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

**బుద్ధదేవ్‌కు ఘన నివాళి**

**ఎంవిపి.కాలనీ :** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఘన నివాళ్లర్పించింది. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు పీతల అప్పారావు, అనపర్తి అప్పారావులు బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సంతాప సభలో జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడారు. పార్టీ నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, ఎంవి.త్రినాధం, సుబ్బరాజు పాల్గొన్నారు.



మద్దిపాలెంలో బుద్ధదేవ్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

**పెందుర్తి :** జివిఎంసి 97వ వార్డు పరిధి కార్మికనగర్‌లో సిపిఎం పెందుర్తి జోన్ కమిటీ ఆధ్వర్యాన సంతాపం తెలిపారు. బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.జగన్, జోన్ కార్యదర్శి రమణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు కె.అప్పలనాయుడు, మౌలాలి, ప్రభుదేవా, ఈశ్వరరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

**గాజువాక:** భెల్ యూనిట్ వద్ద సిపిఎం నాయకులు నల్ల బ్యాడ్జిల్ ధరించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో జిటిపి.ప్రకాష్, కె.విజయ్ కుమార్, కె.నారపరెడ్డి, అప్పారావు, జి.రాంబాబు, జి.అచ్చం నాయుడు, పి.శివరాం, పి.కనకారావు పాల్గొన్నారు.

**ఉక్కునగరం :** బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల కూర్మన్నపాలెంలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉక్కునగరం జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, గౌరవాధ్యక్షులు అయోధ్యరామ్, కె.గంగాధర్, కెవి.సత్యనారాయణ, యు.మరిడయ్య, బి.మహేష్, రామచంద్రమూర్తి, నీలకంఠారావు, పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు

## ఉత్సాహంగా పంద్రాగస్టు ఆటల పోటీలు




క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం సత్యనారాయణ

**ప్రజాశక్తి- నక్కపల్లి :** మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థుకు పలు పోటీలను నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. గురువారం పాఠశాల క్రీడా మైదానంలో ఆటల పోటీలను ప్రారంభించారు.
విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, క్రికెట్, రన్నింగ్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ వంటి పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా పోటీలతో పాటు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించి, విజేతలకు ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, ఎవిఎల్ఎన్.కుమారి, చిన్నారావు, శ్రీదేవి ,కె.రమేష్ బాబు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇ-క్రాప్ నమోదు



మాట్లాడుతున్న ఎఒ సరోజిని

**పజాశక్తి కోటవురట్ల :** ఇ-క్రాప్ నమోదు పారదర్శకంగా చేపట్టి వాస్తవ సాగుదారుల వివరాలను నమోదు చేయాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి సరోజిని అన్నారు గురువారం తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇ-క్రాప్‌లో నమోదైన వివరాల ఆధారంగానే రైతులకు ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ నెంబర్ ఇతర వివరాలతో పంటల సాగు నమోదు చేపట్టాలని సూచించారు. పంటల నమోదు పారదర్శకంగా చేపడితే పంటల బీమా, పంట రుణాలు, పంట ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకాలు వంటివాటిలో వాస్తవ సాగుదారునికి లబ్ధి చేకూరుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం పంటల నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు.రెవిన్యూ సిబ్బంది సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దారు నానిబాబు, ఆర్ఐ ఊర్ధవరావు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :** నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి ఫీడర్ పరిధిలో ఈ నెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ డిఇ విడివి.రామకృష్ణారావు గురువారం తెలిపారు. విద్యుత్ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెదబొడ్డేపల్లి, జోగినాధునిపాలెం, రాయల్ పార్కు, స్టార్ హోమ్స్ మొదలైన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**చీడికాడ :** మండలంలోని ఖండివరం 11కెవి ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనుల నేపథ్యంలో ఈనెల 9న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఎఇ వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఖండివరం, ఎల్‌బిపట్నం, వీరభద్రపేట, సింగవరం, కొండెంపూడి, గొప్పూరు, అప్పలరాజు పురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఎన్నికల కోడ్ అమలుకు పటిష్టచర్యలు

**'ప్రజాశక్తి' కథనానికి స్పందన**

**ప్రజాశక్తి - కొత్తకోట :** ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేయడంతో వచ్చేనెల 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే రావికమతంలో ఎన్నికల కోడ్ ఎక్కడా అమలుకాకపోవడతో గురువారం ప్రజాశక్తిలో 'ఎన్నికల కోడ్ అమలు ఏది?' శీర్షికతో వెలుగులోకి తేగా, రావికమతం మండల స్థాయి అధికారులు స్పందించారు. ఈ మేరకు కొత్తకోటలో పంచాయతీ కార్యాలయంతో పాటు బియన్ రోడ్డులో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. కూటమి నాయకుల ఏర్పాటుఏసిన భారీ ఫ్లెక్సీలను తొలగించారు.



ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు



రాజకీయనేతల విగ్రహాలకు ముసుగేస్తున్న సిబ్బంది

## 17న పాఠశాల కమిటీల ఎన్నికలు

**రీనోటిఫికేషన్ జారీ చేసిన విద్యాశాఖ**



చీడికాడలో నోటిఫికేషన్ జారీ చేస్తున్న ఎంఇఒలు

**ప్రజాశక్తి -కొత్తకోట :** పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలను ఈనెల17న నిర్వహించనున్నట్లు ఎంఇఒ తలుపులు తెలిపారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంఆ మాట్లాడుతూ, రావికమతం మండలంలో51 ప్రాథమిక, తొమ్మిది ప్రాథమికోన్నత,11జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహిస్తారన్నారు.దీనికి సంబంధించి రీనోటిఫికేషన్ జారీ చేశారు. కాగా కొత్తకోట సచివాలయంలో హెచ్ఎం నాగేశ్వరరావు నోటిఫికేషన్ విడుదలచేసి, నోటీస్ బోర్డుపై అంటించారు. ఓటర్ జాబితాను విడుదల చేసారు.

చీడికాడ : ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 8న జరగాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు వాయిదాపడగా, వాటిని ఈనెల 17న నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు రీనోటిఫికేషన్ జారీ చేశ్గారు. రీనోటిఫికేషన్ జారీ చేసిన ఎంఇఒ కె.బొంజుబాబు, వీటిని నోటీసుబోర్డులో అంటించారు. అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్ ప్రతులను అంటించాలని, అలాగే ఈనెల 12న సాయంత్రం 4గంటలకు ఓటర్లయిన విద్యార్థుల తల్లిదండ్రుల ఫైనల్ జాబితా ప్రకటిస్తారన్నారు. 17న కమిటీ సభ్యుల ఎన్నిక, అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక జరగనుంది. కార్యక్రమంలో ఎంఇఒ బొంజుబాబు, వరహామూర్తి, పరదేశి,పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**ప్రజాశక్తి -నక్కపల్లి :** గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నట్లు సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా ఎస్‌పి దీపిక ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వేంపాడు టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ సన్నిబాబు, ఇతర సిబ్బందితో కలిసి సిప్నర్ డాగ్ సహకారంతో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. బస్సులు, కార్లు, బైక్‌లు, ఆటోలు తనిఖీ చేశారు. గంజాయి, నిషేధిత పదార్థాలు అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాలు అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం నిఘా ఉంటుందన్నారు.



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ, ఎస్ఐ